# నీలిమకు నాట్య విశారద బిరుదు ప్రదానం

(కల్చరల్ కంట్రిబ్యూటర్)

విశాఖపట్నం, జూన్ 3 (న్యూస్‌టుడే): పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం నేతృత్వంలో ఉచిత నృత్య, సంగీత శిక్షణ ఇస్తున్న కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థిని కాకర్లపూడి నీలిమరాజుకి ఆదివారం సాయంత్రం కళాభారతిలో 'నాట్య విశారద' యోగ్యతాపత్ర ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ రిజిస్ట్రార్ డాక్టర్ జె.ఎం. నాయుడు ముఖ్య అతిథిగా హాజరయి ఈ పత్రం అందజేశారు. యు.ఎస్.ఎ.లో వుంటున్న ప్రవాసాంధ్ర కూచిపూడి కళాకారిణి గుత్తి బిందుమాధవి పేరున నెలకొల్పిన బంగారు పతకాన్ని ఈ గౌరవ పురస్కారంలో భాగంగా నాట్యాచార్య వెంపటి చినసత్యం అందజేశారు. ఈ సభలో చినసత్యాన్ని, ప్రిన్సిపాల్ హరిరామమూర్తిని, తదితర కళాకారులను రిజిస్ట్రార్ సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి డాక్టర్ జె.ఎం. నాయుడు మాట్లాడుతూ నృత్య కళ అలవడడం భగవత్ ప్రసాదమన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్.సి. బయోటెక్ విద్యార్థినిగా వున్న నీలిమ ఈ పురస్కారం పొందడం తమకు ఆనందంగా వుందన్నారు. తర్వాత డాక్టర్ వెంపటి చినసత్యం మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో, అంకితభావంతో నేర్చుకున్నవారే నాట్యం చక్కగా చేయగల స్థాయికి చేరుకోగల్గుతారన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న నీలిమరాజు

వ్యాఖ్యాత వ్యవహరించిన ఆచార్య ఎ. రామలింగశాస్త్రి ప్రసంగంలో కూచిపూడి నృత్య కళకు అంతర్జాతీయ స్థాయిలో వన్నెతెచ్చిన వెంపటి చినసత్యం మద్రాసు, విశాఖ నగరాల్లో కూచిపూడి ఆర్ట్ అకాడమీ, కూచిపూడి కళాక్షేత్ర నెలకొల్పి వేలాది విద్యార్థులకు ఉచితంగా సంగీతం, నృత్యం, సంస్కృతం నేర్పించడం ప్రశంసనీయమన్నారు. అటువంటి కళాస్రష్ట ద్వారా లభించే 'నాట్య విశారద' యోగ్యతాపత్రాన్ని ప్రభుత్వం తగిన విధంగా గుర్తించాలన్నారు. అవార్డుగ్రహీత, నర్తకి కాకర్లపూడి నీలిమరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాట్యం ప్రదర్శించే స్థాయికి తనను చేర్చిన సద్గురువులకు, గాత్ర వాద్య కళాకారులకు, ప్రోత్సహించిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రదర్శించిన నారాయణీయం, శివాష్టకం, భామాకలాపం, లక్ష్మీప్రవేశదరువు, మరకతమణిమయ తదితర కూచిపూడి నృత్యాంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సద్గురువు వెంపటి చినసత్యం, కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి (నట్టువాంగం), డి.వి. కనకదుర్గ (గానం), జి. నాగరాజన్ (వేణువు), సూర్యకాంతిలాల్ (మృదంగం) ఆర్. చంద్రశేఖర్ (వయొలిన్), టి. విజయ (వీణ) ప్రభృతులు గాత్ర వాద్య సహకారమందించి ప్రదర్శన రక్తి కట్టించారు.